నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్‌సీపీడీసీపీఎల్ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏడీఈ విజయ్‌భాస్కర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయిబాబా టెంపుల్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి 11.30 వరకు శివం, సాయిబాబానగర్, సిఈ కాలనీ, నారాయణగూడ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి 11.30 వరకు బాగ్‌లింగంపల్లి, ఈడబ్ల్యూఎస్ క్వాటర్స్, సూర్యనగర్, నెహ్రూనగర్, అరోరా డిగ్రీ కాలేజ్, అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ హౌజ్, ఆర్‌టిసి క్రాస్ రోడ్, రామాలయం ఫీడర్ల పరిధిలో 11.30 నుంచి 12 గంటల వరకు రిసాలా గడ్డ, ఎస్ఆర్‌టి కాలనీ, ఫైర్ స్టేషన్, అచ్చయ్యనగర్, పిఎఫ్ ఆఫీస్, ఎస్ఆర్‌టీ పార్కు, న్యూ నల్లకుంట, సిండికేట్ బ్యాంక్, నరేంద్ర పార్క్, రామాలయం ప్రాంతం, కృష్ణానగర్, ఫీవర్ ఆసుపత్రి ఫీడర్ల పరిధిలో 12 గంటల నుంచి 12.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. రామాలయం, నరేంద్రనగర్ పార్క్, మదర్ డైరీ, బర్కత్‌పురా బస్టాప్, బీజేపీ ఆఫీస్, ఫీవర్ ఆసుపత్రి, అంజయ్య క్వాటర్స్, లింగంపల్లి, గణేష్ టెంపుల్, తెలంగాణ యువతి మండలి, బర్కత్‌పురా పెట్రోల్ బంక్, ప్రేమ్‌నగర్ ఫీడర్ పరిధిలో 12.30 నుంచి ఒంటి గంట వరకు కరెంటు ఉండదన్నారు. పటేల్‌నగర్ చౌరస్తా, ప్రేమ్‌నగర్, హనుమాన్ దేవాలయం, సునర్ బౌలీ జంక్షన్, ఉదయం స్కూల్, బీజేపీ జెండా, బాపూనగర్ ఫీడర్ పరిధిలో ఒంటి గంట నుంచి 1.30 వరకు బాపూనగర్, ఓవైసీ నగర్, నెక్లెస్ హోటల్, ఆకాష్‌నగర్, అంబర్‌పేట్ ఫీడర్ పరిధిలో 1.30 నుంచి 2 గంటల వరకు అంబర్‌పేట్, ఎంసీహెచ్ కాలనీ, రఘునాథ్‌నగదర్, రామకృష్ణనగర్, వినాయక్‌నగర్, రెడ్ బిల్డింగ్ తదితర ప్రాంతాల్లో మరమ్మత్తుల కారణంగా కోత విధిస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అమృత

నల్లకుంట: డివిజన్ పరిధిలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని నల్లకుంట కార్పొరేటర్ అమృత జలమండలి అధికారులకు సూచించారు. కొంత కాలంగా నల్లకుంట డివిజన్ పరిధిలోని సత్యానగర్‌లో డ్రైనేజీ పొంగిపొర్లుతుండటంతో స్థానికుల ఇబ్బందులపై ఇటీవల 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై స్పందించిన కార్పొరేటర్ అమృత బస్తీ వాసులతో కలిసి రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి డ్రైనేజీ పైపుల మరమ్మతుకు అనుమతులు తీసుకున్నారు. ఈ క్రమంలో శుక్రవారం జలమండలి అధికారులు, సిబ్బందితో కలిసి మురుగు సమస్యలు తలెత్తుతున్న రైల్వే ట్రాక్ ప్రాంతంలో పర్యటించారు. మినీ ఎయిర్ టెక్ మిషన్‌తో డ్రైనేజీ మ్యాన్ హోల్‌లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగింప చేయించారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులు కిశోర్, క్రాంతి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల పెన్షన్ రూ. 6 వేలకు పెంచాలి


మాట్లాడుతున్న ఎం.అడివయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వికలాంగుల పెన్షన్‌ను రూ. 6 వేలకు, వితంతువుల పెన్షన్ రూ.4 వేలకు పెంచాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం చిక్కడపల్లిలోని ఎన్‌పిఆర్‌డి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పెన్షన్‌లో కేంద్ర ప్రభుత్వం వాటా 300 నుంచి రూ.3 వేలకు పెంచాలన్నారు. పెన్షన్ పెంచాలని డిమాండ్ చేస్తూ జూలై 3న రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టరేట్‌ల ఎదుట ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వికలాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్, కోశాధికారి ఆర్.వెంకటేష్, ఉపాధ్యక్షులు రాజు, మధుబాబు, కాశప్ప, ఉపేందర్, దశరథ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిషనర్‌కు శుభాకాంక్షలు


జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్‌లు

అంబర్‌పేట: జీహెచ్ఎంసీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆమ్రపాలికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం కార్పొరేటర్‌లు బి.పద్మా వెంకట్‌రెడ్డి, విజయ కుమార్‌గౌడ్‌లతో కలిసి ఆమె కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బి.వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నిబంధనలు పాటించని ఆటోలపై ట్రాఫిక్ పోలీసుల కొరడా


అంబర్‌పేటలో తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

అంబర్‌పేట: నిబంధనలను పాటించని ఆటో వాలాలపై ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. శుక్రవారం అంబర్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లెనిన్ బాబు నేతృత్వంలో ఆటోల పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన పోలీసులు విద్యార్థులను పరిమితికి మించి తీసుకువెళ్లే ఆటోలపై కేసులు నమోదు చేశారు. డీడీ కాలనీ, గోల్నాక, అంబర్‌పేట ప్రధాన రోడ్ ప్రాంతంలో పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్లుతున్న ఆటోలను గుర్తించి కేసులు నమోదు చేశారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులను పరిమితికి మించి తీసుకెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అయోధ్యకు ఆళ్వారుస్వామి ప్రతిభా అవార్డు

చిక్కడపల్లి: గ్రంథాలయ ఉద్యమనేత వట్టికోట ఆళ్వారుస్వామి ప్రతిభా అవార్డుకు గ్రంథాలయ ఉద్యోగ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు శాగంటి అయోధ్య ఎంపికయ్యారు. ఈ నెల 30న రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి ఆయనకు అవార్డు అందజేస్తారని కామన్ దయాస్ సంస్థ డైరెక్టర్ కనకచారి తెలిపారు.

కొత్త కార్యాలయం ప్రారంభమెప్పుడు?

- పాత భవనంలోనే తూనికలు, కొలతల శాఖ కార్యాలయం
- నిర్మాణ పనులు పూర్తయినా అందుబాటులోకిరాని భవనం
- శిథిల భవనంలోనే అధికారుల విధులు


తూనికలు, కొలతల శాఖ నూతన భవనం

చిక్కడపల్లి: ప్రజలకు విస్తృతమైన సేవలు అందించేందుకు.. ఆన్‌లైన్ దిశగా పరిపాలన సౌలభ్యంగా సాగేందుకు మరిన్ని ప్రభుత్వ భవనాలు అవసరం ఉంది. అయితే ముషీరాబాద్ నియోజవర్గంలోని గాంధీనగర్‌లోని తూనికలు, కొలతలు రాష్ట్ర కార్యాలయంలో విశాలమైన స్థలంలో ఉంది. తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో రెండంతస్తుల భవనాన్ని సుమారు రూ.1.25కోట్లతో నిర్మించారు. కానీ కార్యాలయానికి కావాల్సిన ఇంటీరియర్ వర్క్ జరగలేదు. కేవలం ఖాళీ గదులే దర్శనమిస్తున్నారు. వాటర్‌వర్క్స్ సీవరేజీ బోర్డు, డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణానికి అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నారు. కానీ సంబంధిత అధికారుల నుంచి అనుమతి రాలేదు. తూనికల కొలతలు శాఖ అధికారుల సేవలు విస్తృతంగా అందించాలంటే ఈ భవనాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంటుంది. కానీ ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. గతంలో ఈ శాఖ కంట్రోలర్‌గా పనిచేసిన అకున్ సబర్వాల్ ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యేలా కృషి చేశారు. ఏడాదిన్నర క్రితం భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. నిర్మాణం పూర్తయినా అందుబాటులోకి రాకపోవడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేయాల్సి ఉంది..

తూనికలు కొలతలు శాఖలో కొత్తగా నిర్మించిన భవనం అందుబాటులోకి వస్తే మరింత సౌకర్యవంతంగా ఉంటుందని తూనికలు, కొలతలు డిప్యూటీ కంట్రోలర్ విమల్ బాబు అన్నారు. ఈ నూతన భవనంలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. అప్పుడే టెక్నికల్ ఇతర విభాగాల అధికారులు మరింత ఉత్సాహంగా విధులు నిర్వర్తించేందుకు వీలవుతుందని తెలిపారు.

బోనాల ఉత్సవాల నిధులకు దరఖాస్తు చేసుకోవాలి

చిక్కడపల్లి: ముషీరాబాద్ నియోజవర్గ పరిధిలో అమ్మవారి దేవాలయాల నిర్వాహకులు బోనాల ఉత్సవాల నిధులకు దరఖాస్తులు చేసుకోవాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆషాఢ మాస బోనాల ఉత్సవాలకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలోనే సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలోని దేవాలయాల నిర్వాహకులు గాంధీనగర్ డివిజన్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గాని, కాచిగూడలోని తుల్జాభవాని అసిస్టెంట్ కమిషనర్ (దేవాదాయ, ధర్మాదాయ శాఖ) కార్యాలయంలో దరఖాస్తు పత్రాలను అందజేయాలన్నారు. టెంపుల్ లెటర్ ప్యాడ్ పైనే దరఖాస్తు చేసుకోవాలని దేవాలయం ఫోటోలు 2, దేవాలయం బ్యాంక్ అకౌంట్ నంబర్, అధ్యక్ష, కార్యదర్శి ఆధార్ కార్డు, గత సంవత్సరం చెక్కు సంబంధించిన జిరాక్స్, రెవెన్యూ స్టాంపులు తదితర వివరాలకు సంబంధించిన పత్రాలను జతపరచి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముచ్చకుర్తి ప్రభాకర్ సెల్‌నంబర్ 9392222117 సంప్రదించాలని సూచించారు.

సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో శిక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ విమలా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ తదితర కోర్సులు పూర్తి చేసిన ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా జూలై 6వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. శిక్షణ అనంతరం కేంద్రప్రభుత్వ ఆమోదిత సర్టిఫికెట్ అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు సెల్: 7893141797 సంప్రదించాలన్నారు.

గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ముషీరాబాద్: విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి గెస్ట్ లెక్చరర్ల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ జి.సుకన్య తెలిపారు. అర్హులైన అభ్యర్థులు జూలై 3న 5 గంటలోపు కళాశాల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటర్వ్యూ జూలై 6న ఉదయం 10 గంటలకు ఉంటుందని తెలిపారు. ఆంగ్లంలో రెండు పోస్టులు, సంస్కృతం ఒకటి, వాణిజ్య శాస్త్రం ఒకటి, బీబీఏ ఒకటి, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్ ఏడు, గణితం ఒకటి, మొత్తం 13 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. పీజీలో కనీసం 55 శాతం మార్కులు(ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం) సంబంధిత సబ్జెక్టులో పీహెచ్‌డీ కలిగిన వారికి ప్రాధాన్యం ఇవ్వబడుతుందన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఖైరతాబాద్‌లోని ప్రభుత్వ కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు.

వర్గీకరణ సాధనకు జూలై 7న వంగపల్లి దీక్ష

ముషీరాబాద్: 30 ఏళ్లుగా వర్గీకరణ సమస్యను మానని రాచపుండుగా మారుస్తున్న రాజకీయ పార్టీల వైఖరికి నిరసనగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూలై 7న ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ నిరాహార దీక్ష చేపడుతున్నట్లు ప్రకటించారు. శుక్రవారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీల వైఖరి కారణంగా ఎస్సీ వర్గీకరణ సమస్య పరిష్కారం కావడం లేదు. అందుకు నిరసనగా ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు, కుల సంఘాలు మద్దతు పలకాలని కోరారు. ఎమ్మార్పీఎస్ కోర్ కమిటి సభ్యులు రమేష్‌మాదిగ, గణేష్, యాపాకుల భాస్కర్, హుస్సేన్, బంగారి శ్రీను, యాదగిరి, కొల్లూరి వెంకట్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

1న ఇనాక్ సాహితీ సప్తాహం

చిక్కడపల్లి: శ్రీత్యాగరాయగానసభ నిర్వహణలో జూలై 1న ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తాహాన్ని నిర్వహిస్తున్నట్లు గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జూలై 1న ఇనాక్ కథానిక సాహిత్యం, 2న పరిశోధన సాహిత్యం, 3న కవితా సాహిత్యం, 4న నవలా సాహిత్యం, 5న నాటక సాహిత్యం, 6న విమర్శనా సాహిత్యం, 7న అనువాద సాహిత్యంపై ప్రసంగాలు ఉంటాయన్నారు. ప్రసంగాలకు తొలుత శాస్త్రీయ, నృత్య, సంగీత కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

దోమల నివారణతో వ్యాధుల నియంత్రణ


మాట్లాడుతున్న కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్

అంబర్‌పేట: ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రత్యేక చొరవ తీసుకుంటానని కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం సీపీఎల్ రోడ్ లకోరియా ప్రభుత్వ పాఠశాలలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో దోమల నివారణ, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ మాట్లాడుతూ దోమల నివారణపై విద్యార్థులు అవగాహన పెంచుకుని ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు చొరవ తీసుకోవాలన్నారు. నీటి నిలువ లేకుండా, ఇంటి పరిసరాల్లో పాత వస్తువులు లేకుండా చూసుకోవాలన్నారు. దోమల వ్యాప్తితో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎంటామాలజీ అధికారులు దుర్గప్రసాద్, రాఘవేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుశీల, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కేజ్రీవాల్ అరెస్టుకు వ్యతిరేకంగా నేడు నిరసన దీక్ష

కవాడిగూడ: ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ పార్టీ పిలుపు మేరకు ఈ నెల 29న రాష్ట్ర బీజేపీ కార్యాలయం ఎదురుగా నిర్వహించనున్న ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తల నిరసన దీక్షను జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ కోరారు. శుక్రవారం దోమలగూడలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తుందన్నారు. అరవింద్ కేజ్రీవాల్‌ను ఎన్నికలకు దూరంగా ఉంచాలని, ఆమ్‌ఆద్మీ పార్టీని రద్దు చేయాలని బీజేపీ కోరడం సిగ్గు చేటున్నారు.

ఒక జిల్లాకు పీవీ పేరు పెట్టాలి


పీవీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పోచంపల్లి రమణా రావు తదితరులు

నల్లకుంట: రాష్ట్రంలో ఏదైనా ఒక జిల్లాకు పీవీ జిల్లాగా నామకరణం చేయాలని పీవీ సాధన సమితి అధ్యక్షుడు పోచంపల్లి రమణా రావు అన్నారు. పీవీ సాధన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మాజీ ప్రధాని, భారత రత్న దివంగత పీవీ నరసింహా రావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు జాతి కీర్తి ప్రతిష్టలను విశ్వవ్యాపితం చేసిన గొప్ప నేత దివంగత పీవీ అని కొనియాడారు. పీవీ సేవలకు గుర్తుగా తెలంగాణలోని ఏదైన ఒక జిల్లాకు పీవీ నరసింహారావు జిల్లాగా నామకరణం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవులపల్లి రంగారావు, ప్రచార కార్యదర్శి మంత్రి సునిల్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిరిప్రగడ ఆనంద రావు, దేవులపల్లి అశోక్ కుమార్, గూడా రాజేశ్వర రావు, జి.రామేశ్వర ర ఆవు, మడుపు లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని పీవీకి ఘన నివాళి


పీవీకి నివాళులర్పిస్తున్న డాక్టర్ నీలా శ్రీధర్

కాచిగూడ: మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ పీవీ నరసింహారావు 103వ జయంతి సందర్భంగా శుక్రవారం అంతర్జాతీయ వైశ్య సమాఖ్య తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వాసవీ ఆర్ట్ థియేటర్స్ అధ్యక్షుడు డాక్టర్ నీలా శ్రీధర్ పీవీ నరసింహారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పీవీ మనవడు పీవీ కశ్యప్, మాత వాకర్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు మారం సురేష్ బాబు, జీవన ఆధిత్య, ఉదయ్ కుమార్, శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

చెట్ల కొమ్మల తొలగింపు


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్న చెట్ల కొమ్మలను ఎప్పటికప్పుడు తొలగించాలని బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం డీడీ కాలనీలో అడ్డంగా పెరిగిన చెట్ల కొమ్మలను జీహెచ్ఎంసీ అర్బీకల్చర్ విభాగం సిబ్బందితో తొలగింప చేశారు. చెట్ల కొమ్ములు అడ్డంగా పెరగడంతో విద్యుత్‌కు అంతరాయం కలిగించడంతో పాటు విరిగిపడే ప్రమాదం ఉందని ఆమె అన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

అడ్డగుట్ట: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎస్‌సీఆర్ ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్, ఐజీ ఆరోమాసింగ్ ఠాకూర్ అన్నారు. హైదరాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఇంటర్ డివిజనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు సికింద్రాబాద్‌లోని రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మూడు రోజులుగా జరుగుతున్నాయి. ఇందులో హైదరాబాద్, సికింద్రాబాద్, హెడ్‌క్వార్టర్స్, విజయవాడ, గుంటూరు, గుంతకల్ మొత్తం ఆరు డివిజన్ల టీమ్‌లు పోటీ పడ్డాయి. మెన్స్ సింగిల్స్‌లో హెడ్‌క్వార్టర్స్, మెన్స్ డబుల్స్‌లో గుంటకల్, మెన్స్ సింగిల్స్(45 సంవత్సరాల పైబడి), హెడ్ క్వార్టర్స్, మెన్స్ డబుల్స్(45 సంవత్సరాల పైబడి) గుంటకల్ డివిజన్ టీమ్‌లు గెలిచాయి. శుక్రవారం నిర్వహించిన ముగింపు వేడుకలకు ఆరోమాసింగ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని అన్నారు. అనంతరం టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు, రన్నరప్‌లకు ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు.

కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి


మాట్లాడుతున్న మేకపోతుల వెంకటరమణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: శాసన సభ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల వెంకటరమణ డిమాండ్ చేశారు. శుక్రవారం కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గీతాకార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు రాష్ట్ర ప్రతినిధి బృందం ఇప్పటికే రెండుసార్లు వినతిపత్రం సమర్పించడం జరిగిందన్నారు. అయినా హామీల అమలులో ఎలాంటి పురోగతి లేదన్నారు. వందలాది మంది గీతాకార్మికులు చెట్టుపై నుంచి పడి చనిపోతున్నారని అనేక మంది వికలాంగులు అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాల నివారణకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. తాటి కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం చొరవతో సేఫ్టీ రోప్ 2022లోనే రూపొందించినప్పటికి గత ప్రభుత్వం ఇవ్వలేదని ఈ ప్రభుత్వం కూడా జాప్యం చేస్తుందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి గీతాకార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు జయరాములు, బి.వెంకటనర్సయ్య, గౌనీ వెంకన్న, వెంకటమల్లయ్య, సీతారాములు, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రపంచీకరణతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విస్తృతం


సదస్సును ప్రారంభిస్తున్న ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ తదితరులు

కాచిగూడ: ప్రపంచీకరణతో వ్యాపార, వాణిజ్య రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విస్తృతమయ్యాయని ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ అన్నారు. ఆర్‌జీ కేడియా కాలేజ్ ఆఫ్ కామర్స్, ఉస్మానియా యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్, ఐసీఎస్ఎస్ఆర్ – ఎస్ఆర్‌సీ, టీజీసీహెచ్ఈ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కాచిగూడ లో 'భవిష్యత్ వ్యాపార ధోరణులు – నూతన ఆవిష్కరణలు' అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యాపార, వాణిజ్య రంగాలు కొత్త పుంతలు తొక్కుతున్న నేపథ్యంలో దేశ అభివృద్ధికి మరిన్ని కొత్త పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందన్నారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ రాములు, డీన్ ప్రొఫెసర్ వెంకటయ్య, బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ప్రొఫెసర్ సుధ, బద్రుకా విద్యాసంస్థల చైర్మన్ లక్ష్మీనివాస్ శర్మ, హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు జయవంత్ నాయుడు, ఎస్‌బీ కాబ్రా, రాముల్ ముంద్రా, పింకల్ పటేల్, శీల్‌కుమార్ జైన్, మహేష్ కేడియా, సుమిత్ కాబ్రా తదితరులు పాల్గొని వివిధ అంశాలపై మాట్లాడారు. సదస్సు కన్వీనర్ పరిశోధనా డైరెక్టర్ వందనా సాంబా, జాయింట్ డైరెక్టర్ రామచంద్రమూర్తి, ఎంబీఏ. ఎంసీఏ, న్యాయ కళాశాల, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్ కుమార్, కేవీఎస్ సుధాకర్, డీవీఎన్ ప్రదీప్, కమలేష్ మిట్టల్, తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఆనంద్‌రావుకు న్యాయం చేయండి


ఐపీఎం డైరెక్టర్ డాక్టర్ శివలీలకు వినతి పత్రం అందజేస్తున్న శరత్ నాయక్

కాచిగూడ: ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం రెండు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్‌లో పని చేస్తున్న తెలంగాణకు చెందిన ఆనందరావును అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్‌గా ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు కేటాయించరని, అయితే 22 నెలలు గడుస్తున్నా ఆయనకు ఎలాంటి పదవి ఇవ్వకుండా ఐపీఎం అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శరత్ నాయక్ ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఆనంద్‌రావుకు న్యాయం చేయాలని కోరుతూ ఐపీఎం డైరెక్టర్ డాక్టర్ సి.శివలీలను కలిసి వినతి పత్రం అందజేశారు. దళిత ఉద్యోగిపై కక్ష సాధింపు సరికాదని ఆయన పేర్కొన్నారు. ఈ విషయమై ఇప్పటికే రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర హెల్త్ సెక్రెటరీని కలిసి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఐపీఎంలో జీవో నెంబర్ 106ను అమలు చేసి ఆనందరావుకు న్యాయం చేయాలని, లేని పక్షంలో ఉద్యమ కార్యాచరణను ప్రకటించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గిరిజన శక్తి ప్రతినిధులు సుబ్బు నాయక్, రమేష్ రాథోడ్, హనుమంతు, సతీష్ నాయక్, మౌలాల్ నాయక్, రాజశేఖర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలిక.. గంటలోనే అప్పగింత

రసూల్‌పురా: కార్ఖానా పీఎస్ పరిధిలోని మడ్‌ఫోర్ట్ హట్స్ నుంచి తప్పిపోయిన బాలిక ఆచూకీని సీసీ ఫుటేజీ ద్వారా పరిశీలించి గంటలోనే పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. సీఐ రామకృష్ణ వివరాల ప్రకారం.. మడ్‌ఫోర్ట్ హట్స్‌లో నివసించే పవన్ కుమార్ కూతురు వైశాలి (5) మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఇంట్లో నుంచి నడుస్తూ బయటికి వెళ్లింది. అలా ట్యాంక్‌బండ్ వరకు చేరింది. చిన్నారి కనిపించడం లేదని తల్లిదండ్రులు సీఐకి ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన సీఐ.. ఎస్ఐ రవికుమార్ నేతత్వంలో చిన్నారి ఆచూకీ కోసం బృందాన్ని ఏర్పాటు చేశారు. పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తూ ట్యాంక్‌బండ్ వద్దకు చేరుకున్నారు. అక్కడే ఉన్న వైశాలిని తీసుకుని స్టేషన్‌కు తల్లిదండ్రులను రప్పించి అప్పగించారు. పోలీస్ సిబ్బంది నవీన్, ప్రవీణ్ ఇతర సిబ్బందిని అభినందించారు.

బొగ్గు గనుల ప్రైవేటీకరణను ఆపాలి

అడ్డగుట్ట: కేంద్ర ప్రభుత్వం వెంటనే బొగ్గు గనుల వేలానికి జరిగే ప్రయత్నాలను మానుకోవాలని సీపీఎం సికింద్రాబాద్ జోన్ కన్వీనర్ అజయ్‌బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం అడ్డగుట్ట చౌరస్తాలో సీపీఎం నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం వేలం వేస్తుందని, సింగరేణి కంపెనీ కూడా ప్రైవేటు సంస్థలతో వేలం పాటలో పోటీ పడాలని నిర్ణయించిందన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి హైదరాబాద్ కేంద్రంగానే వేలం పాట ప్రక్రియను ప్రారంభించడం అన్యాయమన్నారు. మల్లేష్, బాలయ్య, మహేందర్, గోపాల్, కృపాకర్, ఫాతిమా, సరోజమ్మ, వజ్రా పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారుల సమస్యలు పరిష్కరించాలి


డాక్టర్ జి.చిన్నారెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న వ్యవసాయ అధికారుల సంఘం ప్రతినిధులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో పని చేస్తున్న వ్యవసాయ అధికారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్షులు డాక్టర్ వైద్యనాథ్ ఆధ్వర్యంలో ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. శుక్రవారం చిన్నారెడ్డిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వ్యవసాయ అధికారుల బదిలీలు, పదోన్నతులు, మొబిలిటి అలవెన్స్‌లు, జీవోనెంబర్ 317 సమస్యలను పరిష్కరించాలని కోరారు. చిన్నారెడ్డిని కలిసిన వారిలో వ్యవసాయ అధికారుల సంఘం చైర్మన్ బి.కృపాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.కృపాకర్‌రెడ్డి, ట్రెజరర్ రవీందర్, సంఘం నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శశిధర్‌రెడ్డి, వికాస్‌పటేల్, కరుణాకర్, హరి, ప్రసాద్, మాలిక్ తదతరులు ఉన్నారు.

బొగ్గు గనులను సింగరేణి సంస్థకు అప్పగించాలి



బతుకమ్మ కుంటలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అంబర్‌పేట: బొగ్గు గనులను ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదంటూ సీపీఎం నాయకులు అన్నారు. ఈ మేరకు శుక్రవారం అంబర్‌పేట నియోజకవర్గ నాయకుడు మహేందర్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. బొగ్గు గనులను వేలం వేయకుండా నేరుగా ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి సంస్థకు కేటాయించాలని ఈ సందర్భంగా మహేందర్ డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా, శ్రవణ పల్లి బొగ్గు బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం వేలం వేసి ప్రైవేటు సంస్థలకు కేటాయించేందుకు మొగ్గ చూపుతుందని ఆయన ఆరోపించారు. రాష్ట్రం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి పర్యవేక్షణలో హైదరాబాద్ కేంద్రంగా శ్రవణపల్లి బొగ్గు బ్లాక్‌ను వేలం వేస్తూ ప్రైవేటు సంస్థలను ప్రోత్సహించడం అన్యాయం అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాములు, సోమయ్య, ఆశోక్, నర్సింగ్‌రావు, ధర్మ తిరుపతి, వీరయ్య, శీను, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.